# అపార్థసారథి

ఇండియా టూరిస్టులకి అమెరికా చూడాలని ఎంతో ఉబలాటం. చదువుకోవాలని వచ్చే వారికి అమెరికా గురించి ఇంకాస్త తెలుసుకోవాలని ఆరాటం. అమెరికాలో కొన్నాళ్ళు ఉద్యోగం చేసి ఇండియాకి తిరిగి వెళ్ళిపోయి, దర్జాగా కాళ్ళ మీద కాళ్ళు వేసుకుని కూర్చోవాలనుకునే వాళ్ళు, అమెరికా రావటమెలాగా అని ఇన్ఫర్మేషన్ కోసం ఇంటర్నెట్లో వెతకటం. అమెరికాలోనే వుండిపోయి, అవకాశాలను స్వంతం చేసుకోవాలనుకునే వాళ్ళకి, అదొక జీవన పోరాటం.

కాకపోతే అందరికీ కావలిసింది, అమెరికా అంటే ఏమిటి? అక్కడ జీవితమెలావుంటుంది? అక్కడ మనవాళ్ళు ఎలా జీవిస్తున్నారు? అని. అంటే ఇన్ఫర్మేషన్ కావాలన్నమాట. ఇది ఎంత సులభమంటే, ఇన్ఫర్మేషన్ హైవే ఎక్కితే ఇన్ఫర్మేషన్ కనిపిస్తుంది. కాకపోతే ఇక్కడో చిన్న తిరకాసుంది. మనం హైవే రోడ్డు ఎక్కినప్పుడు ఎన్నో కార్లు, ఎన్నో రంగుల్లో కనిపిస్తాయి. అలాగే ఈ ఇన్ఫర్మేషన్ హైవే మీద, అది రకరకాలుగా ఎన్నో రంగుల్లో, షేపుల్లో కనిపిస్తుంది. దానివల్లే ఒక చిన్న సమస్య.

ఇంటర్నెట్లో కానీండి, పుస్తకాల ద్వారా కానీండి, టీవీ ద్వారా కానీండి, సినిమాల ద్వారా కానీండి. ఈ ఇన్ఫర్మేషన్ కూడా తెలిపేవారి జ్ఞానాన్నిబట్టీ, అజ్ఞానాన్ని బట్టీ, అవసరార్థాల్ని బట్టీ రకరకాలుగా వుంటుంది. ఒక్కొక్కప్పుడు అర్థంలేకుండానూ, అపార్థాలని కలిగించేట్టుగానూ వుంటుందన్నా ఆశ్చర్యపోనక్కర్లేదు. అందుకని ఈ ఇన్ఫర్మేషన్ కోసం వెతికేవాళ్ళు కొంచెం జాగ్రత్తగా కాచి వడబోసి, ఏది ఎంత కావాలో అంతే తీసుకుని మిగతాది పారబోయటం మంచిది.

ఒక పదిరోజులు అమెరికా వచ్చి తిరిగివెళ్ళిన ఒక రచయిత, అమెరికన్ల మనస్థత్వాల్నీవాళ్ళ జీవిత విధానాన్నీ పూర్తిగా చదివేసినట్టుగా రాసి పారేస్తాడు. ట్రావెలాగులు, ఇంతకుముందు నేను చెప్పినట్టుగా, లాగులు వేసుకునే ప్రతివాడూ రాస్తూనే వున్నాడు. అవి ఆ ప్రదేశాల గురించో, ఆ ప్రదేశాల్లో వారి అనుభవాల గురించో రాస్తే బాగానే వుంటుంది. ఆ పదిరోజుల అనుభవంతో, వాళ్ళు చూసిన నాలుగు విషయాలనీ మొత్తం దేశానికే అన్వయించి రాస్తే, అది తప్పు అయే అవకాశాలు చాల వున్నాయి. ఆ మధ్య ఇక్కడికి వచ్చిన ఒక ప్రముఖ రచయిత తను వ్రాసిన రచనలుచదివి అందర్నీ ఆనందపరిచాడు. చాల బాగుంది, ఈయన గొప్పవాడు అని మేంఅనుకుంటున్నప్పుడు ఒక బాంబు పేల్చాడు. భారతీయులంతా ఆధ్యాత్మికంగా గొప్పవాళ్ళు. డబ్బు కాపీనం లేనివాళ్ళు. అమెరికాలో మీరంతా డబ్బుకోసంతంటాలు పడుతుంటారు అంతా డబ్బులోనే వుంది అన్నాడు.

ప్రేక్షకులలోనించి ఒక సుబ్బారావుగారు చిన్మయానందుడిలా నవ్వి, "అయ్యా! మేమూ మీలాటి భారతీయులమే. మీరు మా గురించి మాట్లాడుతుంటే,

మీ గురించి మాట్లాడుతున్నట్టేకదా. అలాకాక, అమెరికన్ల గురించి మాట్లాడుతున్నారనుకోటానికి ఈ ట్రిప్పులో ఒక్క అమెరికన్ని కూడా మీరు కలిసినట్టు లేదు అలాగే డబ్బు కాపీనం అన్నది ఒక దేశానికే పరిమితమైన కాపీరైట్ కాదు. కొంత మంది మనుష్యుల్లో, వాళ్ళు ఎక్కడున్నా, ఏ దేశానికి చెందినా అది వుంటుంది. రకరకాల కారణాల వల్ల, రకారకాల అవకాశాల కోసం వెతుక్కోవటం మానవ సహజం. అది కాపీనం కాదు. ఆశావాదం. నేనూ అలాగే ఇక్కడికి వచ్చాను ఇప్పుడు మీరు అమెరికాకి వచ్చి వుంటున్న ఇంటి యజమాని, అంటే మీ స్వంత కొడుకు కూడా అలా అవకాశాలు వెతుక్కుంటూ వచ్చిన ఆధ్యాత్మికుడే. కాదంటారా?" అన్నాడు, ఇండియానించి అమెరికాకి డబ్బు సంపాదన కోసం రోజూ ఎంతమంది దిగుమతి అవుతున్నారో గుర్తుకి తెచ్చుకుంటూ.

అలాగే ఇంకొక రచయిత "అమెరికాలో ప్రతివాడూ, ఇదిచేస్తే నాకేమిటి లాభం?" అనుకుంటాడు అని రాశాడు. కొంచెం అనుభవంతో ఆలోచిస్తే, దాంట్లో నిజం నేతి బీరకాయలోవున్న నేతి కన్నా కొంచెం తక్కువగా వుంది అని అర్థమయిపోతుంది. మానవ మనస్తత్వాలలోని లక్షణాలని ఒక దేశానికో, ఒక సంస్కృతికో అన్వయిస్తే అంతేమరి. ఇది కొంత సీరియస్‌గా చేసిన విమర్శ అయితే, కొన్ని సరదాగా వుంటాయి.

అమెరికాలో మనవారి జీవితం మీద చాల చక్కటి సినిమాలు, అమెరికా, కెనడా, ఇంగ్లండ్‌లలో తీసిన సినిమాలు వచ్చాయి. అవి కొన్ని హాస్యంగానూ, కొన్ని సీరియస్‌గానూ, కొంత డ్రమెటిక్‌గానూ వున్నా, ఇక్కడి జీవితాలను చక్కగా, సహజంగా చిత్రించాయి. కాకపోతే అమెరికా అంటే ఏ మాత్రం అవగాహన లేని కొంతమంది తెలుగు హిందీ తమిళ దర్శకులు అమెరికాలో అమెరికా జీవితం గురించి తీసిన సినిమాలు చూస్తే నవ్వాలో ఏడవాలో అర్థంకాదు. అలాటి ఒక సినిమాలో ఎయిర్‌పోర్ట్‌లో దిగిన హీరోయిన్, అక్కడినించీ హీరోగారి ఇంటిదాకా కాసేపు కారులో, కాసేపు నడుస్తూ, కాసేపు పరుగెత్తుతూ డాన్స్ చేస్తూనే వుంది. హీరో వెనక పాతికమంది తెల్ల+నల్ల+బ్రౌన్ దొరలు, హీరోయిన్ వెనక ఇంకో పాతికమంది తెల్ల+నల్ల+బ్రౌన్ దొరసానులు మెలికలు తిరిగిన రోడ్డుమీద మెలికలు తిరుగుతూ డాన్స్ చేస్తున్నారు. ఈలోగా ఆ డాన్స్ చేసే వాళ్ళ వెనకాల కారులో నల్ల కళ్ళద్దాలు పెట్టుకున్న విలన్, మన హీరోని ఎగాదిగా చూశాడు.

"నువ్వు చిన్నప్పుడు సూర్యారావ్‌పేటలో నాతోపాటూ ఎల్‌కేజీ చదివిన సూర్యారావ్‌వికదూ. ఎల్‌కేజీ పూర్తిచేయకుండానే అమెరికా వచ్చేవు. ఆనాటి మన శతృత్వం ఈనాడు మళ్ళీ కొనసాగిద్దాం" అని అతనితో ఫైటింగ్ మొదలుపెట్టాడు న్యూయార్క్‌లో స్టేట్యూ ఆఫ్ లిబర్టీ దగ్గర మొదలు పెట్టి, నయాగరా మీదుగా, కాలిఫోర్నియా దాకా వచ్చి కొట్టుకుంటున్నారు.

అలాగే ఇంకో సినిమాలో, ఇండియానించి వచ్చిన ఒక ముసలావిడని, డిస్నీలాండ్‌లో కళాపి చల్లి, అక్కడ అలికి బియ్యప్పిండితో ముగ్గులు పెట్టమని ఒక పాట పాడారు, రోడ్డుమీద డాన్స్ చేస్తూ.

ఆమధ్య ఏదో పార్టీకి వెడితే పార్ధసారథి అనే ఆయన కలిశాడు. ఆయన ఇండియాలో పదిహేనేళ్ళు పైన పనిచేసి, అప్పుడే అమెరికా వచ్చాడు, సెటిలై పోదామని. ఆయనకి ఇన్ఫర్మేషన్ ఏ హైవే నించీ వచ్చిందో కానీ, చాల ఆశ్చర్య కరంగా వుంది. మాటలమధ్యలో, నా అమెరికన్ స్నేహితుడు 25వ వివాహ వార్షి కోత్సవం చేసుకుంటున్నాడనీ, ఆ సందర్భంలో భార్యాభర్తలిద్దరూ హవాయికి వెడుతున్నారనీ చెబితే "నేను నమ్మను. డైవర్స్ తీసుకోకుండా ఇన్నాళ్ళు ఒకే పెళ్ళాంలోవున్నాడంటే ఆశ్చర్యంగానే వుంది" అన్నాడు.

మనలాగా పిల్లకి ఆధ్యాత్మకంగా ఏమీ లేదు అన్నఆయనే కొన్నాళ్ళ తర్వాత ఒకరోజు నాతో నెమ్మదిగా అన్నాడు, "అమెరికన్లు చాలమంది ప్రతి ఆది వారం చర్చికి వెడతారండీ. చర్చికి చందాలుకూడా విరివిగా ఇస్తారు" అన్నాడు.

ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే, మనం అందుకున్న సమాచారాన్ని బట్టి కొన్ని అభిప్రాయాలు ఏర్పరుచుకుంటాం. ఆ సమాచారం ఎంతవరకూ నిజ మో అనుభవం మీద కానీ తెలీదు. అది నిజమో కాదో మనకి తెలిసేదాకా ఆ సమా చారాన్ని నేను "ఇన్ఫర్మేషన్"అనకుండా "పర్సెప్షన్" లేదా "పర్సీవ్డ్ ఇన్ఫర్మేషన్" అంటాను. అంటే "ఇలా వుంటుందిట అనుకునే సమాచారం" అని అనచ్చేమో.

ఇది అమెరికా గురించి భారతీయులు అనుకునేది మాత్రమే కాదు. ఇండి యాని చూడని అమెరికన్లకు భారతదేశం గురించి తెలిసేది కూడా ఇలాటి సమా చారమే. నేను ఇందాక అన్నట్టు ఈ ఇన్ఫర్మేషన్ తెలిపేవారి జ్ఞానాన్ని బట్టీ, అజ్ఞా నాన్ని బట్టీ, అవసరార్థాలిబట్టీ రకరకాలుగా వుంటుంది. అందుకని ఆ సమాచారం ఇచ్చేవారు, క్షుణ్ణంగా పరిశీలించి కానీ అలాటి సమాచారం ఇవ్వకూడదు. అలాగే అలాటి సమాచారం అందుకునేవారుకూడా జాగ్రత్తగా వుండటం మంచిది.

పార్ధసారథి అమెరికా వచ్చిన కొత్తల్లో మా ఇంటికి వచ్చి, మీ ఇంటి ఎదురుగా ఒక నల్లాయన వున్నాడేమిటండీ! భయమేమీ లేదు కదా! అన్నాడు.

ఆ మాటలకి ముందు బిత్తరపోయినా ఆయన సంగతి తెలుసు కనుక, ఆయన ఎవరనుకుంటున్నారు. ఇక్కడే ఒక హైటెక్ కంపెనీలో మార్కెటింగ్ డైరెక్టర్! చాల మంచివాడు!" అన్నాను.

అలా అన్నాక ఆయన్నోఆట పట్టిద్దామని "అంతేకాదు. మా ఇంటి పక్క తెల్లాయన మమ్మల్ని చూసి ఆ నల్లాయనతో, మీ ఇంటి ఎదురుగా ఎవరో ఇండి యన్ వున్నాడేమిటండీ, భయమేమీ లేదుకదా! అన్నాట్ట. ఈ నల్లాయన- ఆయన ఎవరనుకుంటున్నారు. ఇక్కడే ఒక హైటెక్ కంపెనీలో ఇంజనీరింగ్ మేనేజర్! చాల మంచివాడు! అన్నాట్ట. ఆయన ఆ మాట నాతో అని పడీపడీ నవ్వాడు" అన్నాను.

పార్ధసారథిగారు, నేను చెప్పింది నిజమో కట్టుకథో అర్థంకాక, నన్ను అయోమయంగా చూశాడు.

* * *